# జూన్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు

- సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ..
- కలెక్టర్ రాహుల్‌రాజ్



వెల్దుర్తిలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, ఏప్రిల్ 24: భూ భారతి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రైతువేదికలో నిర్వహించిన భూ భారతి పోర్టల్ అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్ నాయకులు, రైతులకు అవగాహన కల్పించారు. భూ భారతి పోర్టల్ ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా ఉందని, జూన్ 2 నుంచి పూర్తిస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి వస్తుందని, ఆ రోజు నుంచి గ్రామాల్లో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, సమస్యలపై దరఖాస్తులను తీసుకొని వాటిని పరిష్కరించనున్నారు. ఈ సదస్సులో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మండల ప్రత్యేక అధికారిణి నీలిమా, తహసీల్దార్ కృష్ణ, ఏడీఏ పుణ్యవతి, ఏవో ఝాన్సీ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్‌లతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, ఏప్రిల్ 24 : భూభారతి పోర్టల్‌తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. నిజాంపేటలోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. భూ సమస్యలు ఉంటే ముందస్తుగా తహసీల్దార్ ఆ తర్వాత ఆర్డీవో, కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి, మండల ఏవో సోమలింగారెడ్డి, డీపీఆర్వో రాంచందర్‌రాజు, ఎంపీవో ప్రవీణ్,ఆర్ఐ ప్రీతి, ఇమాద్, ఏఈవోలు, మండల కార్యదర్శులు, నాయకులు లింగంగౌడ్, మహేందర్, రవీందర్‌రెడ్డి, నసీరోద్దీన్, వెంకటేశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



రామాయంపేటలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

రామాయంపేట, ఏప్రిల్ 24 : రామాయంపేట మండలంతో పాటు పట్టణంలోని సుతారిపల్లి, కోనాపూర్, తొనిగండ్ల తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రజినీ కుమారి తనిఖీ చేశారు. గురువారం వివిధ గ్రామాల్లో పర్యటించిన తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు జరుపాలన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ.గౌస్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి



మహాధర్నా కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేస్తూ మే 2, 3 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 24 గంటల మహాధర్నాను విజయవంతం చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం హవేళీఘనపూర్ మండలంలోని లింగాసానిపల్లి, బ్యాతోల్, తొగిట గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, అంత్యోదయ రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కవిత, కిష్టయ్య నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్లందరికీ మే నెలంతా ఒకేసారి సెలవులు అమలు చేస్తామని మంత్రి సీతక్క ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మళ్లీ 15 రోజులు టీచర్లు, మరో 15 రోజులు ఆయాలు పని చేయాలని సర్క్యులర్ జారీ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి మే నెలంతా సెలవులు ప్రకటించాలన్నారు. లేని పక్షంలో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేస్తామన్నారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, నాయకురాల్లు రాజ్యలక్ష్మి, జబీనా, విజయ, మంగ, రజిత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మకు ఘనంగా బోనాలు



పెద్దశంకరంపేట మండలం మల్కాపూర్‌లో కట్టమైసమ్మకు గురువారం గ్రామస్తులు వైభవంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. -పెద్దశంకరంపేట,ఏప్రిల్ 24

## చెట్టును ఢీకొని ఒకరి మృతి

రామాయంపేట, ఏప్రిల్ 24: అదుపు తప్పి బైక్ చెట్టును ఢీకొన్నఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దూదేకుల గఫూర్ (40) చేగుంట మండలం పులిమామిడి గ్రామం నుంచి పనులు ముగించుకొని బైక్‌పై వస్తుండగా పులిమామిడి శివారులో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## టిప్పర్ కిందపడి యువకుడి మృతి

మర్కూక్,ఏప్రిల్24:టిప్పర్ కిందపడి యువకుడు మృతి చెందాడు. మర్కూక్ ఎస్సై దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కర్కపట్ల గ్రామానికి చెందిన బీమరి కరుణాకర్ (24) అదే గ్రామానికి చెందిన బీమరి శ్రీకాంత్ వద్ద కొన్ని రోజులుగా క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి కర్కపట్లకు చెందిన గ్యార మల్లేశం వ్యవసాయ భూమిని జేసీబీ యంత్రాలతో చదునుచేసి మట్టిని తరలించేపనిలో ఉండగా అప్పటికే అలిసిపోయిన కరుణాకర్ నిద్రిస్తున్నాడు. ఇది గమనించిన టిప్పర్ డ్రైవర్ చౌహాన్‌గణేశ్ నిర్లక్ష్యంగా నిద్రిస్తున్న కరుణాకర్‌పై ఎక్కించాడు. దీంతో కరుణాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు అతడిని తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు రోహిత్ ఎంపిక



ఎంపికైన రోహిత్

నంగునూరు, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి భానోతు రోహిత్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు రమేశ్, వ్యాయమా ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో రోహిత్ పాల్గొంటారని వెల్లడించారు. ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు అభినందించారు.

## డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : మెదక్ పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఎస్సీలో బీజడ్సీ, ఎంజడ్సీ, ఎంపీసీఎస్, బీకాం, బీఏ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్టీ విద్యార్థినీలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు 790109 7706, 8121158330 సంప్రదించాలని సూచించారు.

## వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని ఖాజాపూర్‌లో సానీక్షా ఫౌండేషన్ సౌజన్యంతో మల్లారెడ్డి దవాఖాన సిబ్బంది గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి 170 మంది రోగులు ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. కంటి ఆపరేషన్ ఉన్నవారిని సోమవారం దవాఖానకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేస్తామని ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రవి కుమార్ తెలిపారు. డాక్టర్లు భాగ్య, సాయి, మౌశిక్‌రెడ్డి, శివ, కో-ఆర్డినేటర్ సంజీవ్, ఫీల్డ్ ఆఫీసర్ రవి, ఫార్మాసిస్ట్ సబిత, గాయత్రి, శంకర్ నాయక్, నరేశ్ ఉన్నారు.

## ఉద్యమకారులపై అక్రమ కేసులు

**బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చల్మెటి నాగరాజు**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత నాగరాజు

నిజాంపేట, ఏప్రిల్ 24 : ఉద్యమకారులపై కాంగ్రెస్ నాయకులు కక్ష పూరితంగా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నదని, వారికి త్వరలోనే తగిన బుద్ధి చెబుతామని బీఆర్ఎస్ నిజాంపేట గ్రామ అధ్యక్షుడు చల్మెటి నాగరాజు మండిపడ్డారు. గురువారం నిజాంపేటలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్‌పై మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సోషల్ మీడియాలో చేసిన అనుచిత వాఖ్యలకు ధీటుగా సమాధానం ఇచ్చిన కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డిపై స్థానిక కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. నిజాంపేటలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏం అభివృద్ధి పనులు చేశారో చూపెట్టాలని ఆయన విమర్శించారు.

## ఆడ పిల్లలను రక్షించాలి



పోషణ్ పక్వాడలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

నిజాంపేట, ఏప్రిల్ 24 : కుటుంబ స్థాయి నుంచే ప్రతి ఒక్కరూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సీడీపీవో స్వరూపరాణి అన్నారు. గురువారం నిజాంపేటలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఆడ పిల్లలను రక్షించి వారిని చదివించే బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, తహసీల్దార్ రమ్యశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంపీవో ప్రవీణ్, ఆర్ఐ ప్రీతి, డాక్టర్ హరిప్రియ, చేగుంట సీడీపీవోలు షైనీ, సువర్ణ, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు ఉన్నారు.

## మహాసభకు పాదయాత్రగా..



రవిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు, బీఆర్ఎస్ శ్రేణులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన యువకుడు గడ్డమీది రవి గురువారం ఉదయం చేతిలో గులాబీ జెండా పట్టి పాదయాత్రగా బయలుదేరారు. మధ్యాహ్నం మెదక్ పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ బీఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ శ్రేణులు రవికు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయానికి తీసుకెళ్లి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అభిమానంతోనే ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పాదయాత్రగా వెళ్లుతున్నట్లు గడ్డమీది రవి పేర్కొన్నారు.

**కౌడిపల్లిలో..**

కౌడిపల్లి, ఏప్రిల్24 : చలో వరంగల్ సభకు పాదయాత్రగా కౌడిపల్లి మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన గడ్డమీది రవి గురువారం బయలు దేరాడు. అనంతరం మెదక్‌కు చేరుకోగా, పార్టీ కార్యాలయంలో నేతలు సన్మానించారు.

## నర్సరీలను కాపాడాలి



గిరిజన తండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో షాజీలొద్దీన్

రామాయంపేట, ఏప్రిల్ 24 : నర్సరీలను కాపాడే పూర్తి బాధ్యత కార్యదర్శులపై ఉందని రామాయంపేట ఎంపీడీవో షాజీలొద్దీన్ అన్నారు. గురువారం రామాయంపేట మండలంలోని గిరిజన తండాలో నర్సరీలను పరిశీలించి, కార్యదర్శులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం నర్సరీలోని మొక్కలను కాపాడేందు కోసం షెడ్‌నెట్లను మంజూరు చేసిందన్నారు. నర్సరీలో పెంచే మొక్కలకు లెక్కలు పక్కాగా ఉండాలన్నారు. అధికారి వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.



నర్సాపూర్‌లో సంతాపం తెలుపుతున్న మార్నింగ్ వాకర్స్





కొల్చారం: పోతంశెట్టిపల్లి చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



మెదక్ మున్సిపాలిటీ : కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, నాయకులు

## ఉగ్ర ఘాతుకంపై నిరసనల వెల్లువ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం హేయమైన చర్య అని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం టీఎన్జీవో భవన్‌లో అత్యవర సమావేశం ఏర్పాటు చేసి పర్యటకులపై మరణకాండను తీవ్రంగా ఖండించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. టీఎన్జీవో నాయకులు ఇక్బాల్ పాష, పజలుద్దిన్, రఘునాథరావు, గోపాల్, శివాజీ, సలావుద్దీన్, ధర్మచందర్, లింగప్ప, భరత్, సలీం, శ్రీదర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్, ఏప్రిల్ 24 : ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతిచెందిన వారికి గురువారం నర్సాపూర్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కొల్చారంలో..**

కొల్చారం, ఏప్రిల్ 24: మండల పరిధిలోని పోతంశెట్టిపల్లిలో స్థానికులు, నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతిచెందిన వారికి నివాళులర్పించారు.



ఉగ్రవాదుల దాడికి నిరసనగా రామాయంపేటలో అన్ని పార్టీల నాయకులు జాతీయ జెండాలతో గురువారం రాత్రిపెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ. సీపీఎం తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు. -రామాయంపేట, ఏప్రిల్ 24

## కారు ఢీకొని వ్యక్తి మృతి

వర్గల్, ఏప్రిల్ 24 : మండల పరిధిలోని సింగాయిపల్లి చౌరస్తావద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మర్కూక్ మండలం ఎర్రవల్లికి చెందిన చందా గణేశ్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా సింగాయిపల్లి చౌరస్తావద్ద యూటర్న్ పాయింట్ వద్ద కారు ఢీకొట్టడంతో గణేశ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

వర్గల్, ఏప్రిల్ 24 : రోడ్లపై వడ్లు,ఇతర ధాన్యాలు ఆరబోసి ప్రమాదాలకు కారణం కావొద్దని గౌరారం ఎస్సై కరుణా కర్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు యాసంగి పంటలు చేతికొస్తున్న తరుణంలో వడ్లతో సహా ఇతర చిరుధాన్యాలు ఆరబెట్టేందుకు చాలా గ్రామాల్లో రోడ్లను ఆశ్రయిస్తున్నారని ,ఇది మంచి పద్ధతి కాదన్నారు. కల్లాలు, ఇంటివద్ద ధాన్యాలను ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబోసే రైతులపై కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ ఉద్యోగ శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన లేదా తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం సాఫ్ట్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై ఐదు రోజుల పాటు ఉద్యోగ కల్పన శిక్షణ నిర్వహిస్తున్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. 25 ఏండ్ల లోపు వయస్సు కలిగిన యువత దీనికి అర్హులని, శిక్షణ మే 2 నుంచి 6వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు కళాశాలలో ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## మహిళా వ్యాపారులకు అవగాహన

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలు నెలకొల్పడానికి వీహాబ్ ఎంతో తోడ్పాటునందిస్తున్నదని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గురుకవారం కలెక్టరేట్‌లో అవగాహన కల్పించారు. మహిళ సంఘాల నాయకురాల్లు, సభ్యులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు
## జిల్లా క్రీడాకారులు ఎంపిక



శరత్‌చంద్ర



హసన్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24 : ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా నుంచి శరత్‌చంద్ర, హసన్ ఎంపికైనట్లు గురువారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టులో మొత్తం 18 మంది క్రీడాకారులు ఉండగా జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులకు చోటు దక్కడం ఎంతో సంతోషకరమన్నారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, జిల్లా ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, వినయ్‌తో పాటు సభ్యులు అభినందించారు.

## యువతి అదృశ్యం



కృష్ణవేణి (ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 24 : యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామానికి చెందిన కంచర్ల కృష్ణవేణి (19) బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి నర్సాపూర్‌లోని అన్నపూర్ణ దవాఖానకు వచ్చింది. కృష్ణవేణి తల్లి చంద్రకళ, కుటుంబ సభ్యులు దావాఖానలోకి వెళ్లగా కృష్ణవేణి రిసెప్షన్‌లో కూర్చున్నది. కాసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి కృష్ణవేణి కనిపించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## ఆర్థిక సాయం

నిజాంపేట, ఏప్రిల్ 24 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన జెల్ల పోచమ్మ వారం రోజుల కింద అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి గురువారం మండల కో-అప్షన్ మాజీ సభ్యుడు గౌస్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు దుబ్బరాజగౌడ్, అంజగౌడ్, బాల్‌రాజు, భూమయ్య, పోచయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24 : బాధిత కుటుంబానికి గురువారం బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండల పరిధిలోని జంగరాయి గ్రామానికి చెందిన గడ్డం మాణెమ్మ కుమారుడు చింటు ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ. 5వేలు పంపించగా, నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, నేతలు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో పని చేయుటకు Civil Engineer కావలెను. Exp. 3 years, జీతం: 35,000/-, ఫోన్: 8688010673.
NT-Sai Ram

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.